క్లుప్తంగా

7 నుంచి మహాభారత యజ్ఞం

సదుం: మండలంలోని భట్టువారిపల్లె భారతం మిట్ట వద్ద ఈ నెల 7 నుంచి మహాభారత యజ్ఞం ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలు పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో 18 రోజుల పాటు కొనసాగనున్నట్టు పేర్కొన్నారు. భాగవతారిణి జ్యోత్స్న ప్రతి రోజూ మధ్యాహ్నం హరికథా గానం చేస్తారని, రాత్రి నాటక ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు.

క్షయ వ్యాధి నివారణే లక్ష్యం


క్షయ వ్యాధిగ్రస్తులకు సరుకులు అందజేస్తున్న డాక్టర్ మురళి

వి.కోట : క్షయ వ్యాధి నివారణే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని టీబీ సూపర్‌వైజర్ హరిప్రసాద్, సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మురళి తెలిపారు. వారు గురువారం క్షయవ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తులు మందులతో పాటు పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధి నుంచి బయట పడవచ్చన్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే దగ్గరలోని ప్రభుత్వాస్పత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే 6 నెలలకు సరిపడా మందులను ఉచితంగా అందజేస్తామని చెప్పారు. అంతేగాక రోగికి నెలకు రూ.1000లను కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని వెల్లడించారు. అనంతరం జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ సహకారంతో ఐదుగురు క్షయ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ సపోర్ట్ సరుకులు అందజేశారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

పుంగనూరు(చౌడేపల్లె): పుంగనూరు పట్టణంలోని అంబేడ్కర్ భవనం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఈ క్రమంలో ఏఎస్‌ఐ అశ్వర్థనారాయణ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. అతను పట్టణంలో భిక్షాటన చేసుకుంటు జీవిస్తున్నట్టు స్థానికులు తెలిపారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన


చెత్త సేకరణను పరిశీలిస్తున్న ఎంపీడీవో బాలాజీ

పెద్దపంజాణి: మండలంలోని కోగిలేరు పంచాయతీలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను గురువారం ఎంపీడీవో బాలాజీ పరిశీలించారు. చెత్త సేకరణ, ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అన్నిగ్రామాల్లోనూ తాగునీటి నాణ్యతా పరీక్షలు చేయించాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శారదాదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

గుడుపల్లె : గుడుపల్లెలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం గ్రేస్ మేరియా చారిటబుల్ ఎడ్యుకేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. 400 మంది విద్యార్థులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి మందులు అందజేశారు. ట్రస్టు నిర్వాహకుడు ఆరోగ్యరాజ్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహా భాగ్యమని, విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు.

బదిలీ అయిన టీచర్లకు పూర్తి జీతం ఇవ్వాలి


ఎంఈవోకు వినతి పత్రం ఇస్తున్న టీచర్లు

చౌడేపల్లె: బదిలీ అయిన టీచర్లకు జూన్ నెల జీతం మండలం నుంచే మంజూరు చేయాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సహదేవయ్య డిమాండ్ చేశారు. ఆయన గురువారం ఎంఈవో తిరుమలమ్మకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన జూన్ నెల పూర్తి జీతాన్ని మండలం నుంచే బిల్లులు పెట్టాలన్నారు. మూడు నెలలకొకసారి కోఆర్డినేషన్ మీటింగ్ ఏర్పాటుచేయాలన్నారు. ఇటీవల బదిలీపై మండలానికి వచ్చిన ఉపాధ్యాయుల పరిచయ కార్యక్రమం, 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఐటీ షెడ్యూలు అందజేయాలని కోరారు. సామిరెడ్డిపల్లెలో ఉపాధ్యాయుడి బదిలీ, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఎల్‌పీసీ, ఆర్‌సీలు సకాలంలో అందజేసి 2008 డీఎస్సీ ఉపాధ్యాయులకు ఇంక్రిమెంట్లు, ఎస్‌ఆర్ అప్‌డేషన్‌పై చర్చించారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయుడు సెలవుపై వెళ్లినప్పుడు మరొక ఉపాధ్యాయుడిని డెప్యుటేషన్‌పై నియమించాలని కోరారు.

ఫోర్‌లేన్‌గా
పలమనేరు-కుప్పం రోడ్డు

ఇప్పటి దాకా డబుల్ రోడ్డుగా ఉన్న పలమనేరు–కుప్పం రహదారి నాలుగు లేన్లుగా మారనుంది. చైన్నై– బెంగళూరు జాతీయ రహదారి పలమనేరు సమీపంలోని క్యాటిల్‌ఫామ్ నుంచి కుప్పం సమీపంలోని తమిళనాడు సరిహద్దు వరకు 97 కిలోమీటర్ల మేర దీన్ని నిర్మించనున్నారు. ఆ మేరకు ఏపీలో పది రోడ్లకు సంబంధించి ఈ పనులకు రూ.1500 కోట్లతో రోడ్డు రవాణా, మంత్రిత్వశాఖ అంచనా వేసినట్టు అధికారులు తెలిపారు. ఆమేరకు ఈ రహదారి డీపీఆర్‌కు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

- డీపీఆర్ తయారుచేయాలని కేంద్రం ఆదేశాలు
- క్యాటిల్‌ఫామ్ నుంచి క్రిష్ణగిరి సరిహద్దు వరకు
- 97 కిలోమీటర్ల చతుర్ముఖ రోడ్డుగా నిర్మాణం
- ఐదుచోట్ల బైపాస్‌ల నిర్మాణం


ఫోర్‌లేన్‌గా మారనున్న పలమనేరు-కుప్పం రహదారి

పలమనేరు : నియోజకవర్గంలోని బైరెడ్డిపల్లి, వీకోటలో బైపాస్ రోడ్ల నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ఇప్పటికే బైరెడ్డిపల్లిలో ఆరు కిలోమీటర్ల బైపాస్ రోడ్డుకు భూసేకరణ పూర్తయ్యింది. వీకోటలో పది కిలోమీటర్ల బైపాస్ రోడ్డుకు అలైన్‌మెంట్ మార్పులో నెలకొన్న గందరగోళం, కోర్టు కేసుల వల్ల ఎల్‌ఏతో నిలిచింది. ఈ రెండు చోట్ల బైపాస్‌ల నిర్మాణం కోసం గత ప్రభుత్వంలో రూ.70 కోట్లు మంజూరై ఆపై అంచనాలు పెరిగి ఇప్పుడు వంద కోట్లకు చేరింది. ఈ పనులను జేఎంసీ కన్‌స్ట్రక్షన్స్ దక్కించుకుంది. వీటితోపాటు కొత్తగా రాజుపేట రోడ్డు, శాంతిపురం, అక్కడి నుంచి కుప్పం మధ్యలో ఒక చోట మొత్తం ఐదు బైపాస్‌లను నిర్మించనున్నారు.

రోడ్డు విస్తరణ తప్పనట్టే

పలమనేరు–కుప్పం రోడ్డు ఫోర్‌లేన్‌గా మారనున్న నేపథ్యంలో రోడ్డు విస్తరణ, సోల్డర్ల పెంపు కచ్చితంగా చేపట్టాల్సి ఉంటుంది. ఈ మార్గంలోని క్యాటిల్ ఫాం, నక్కపల్లి, గొల్లపల్లి, కొలమాసనపల్లి, దుగ్గినవారిపల్లి, కూర్మాయి, బేలుపల్లి క్రాస్, సాకేవూరు, చీలంపల్లి, దేవదొడ్డి, కస్తూరినగరం, తోటకనుమ, పత్రపల్లి, చెల్దిగానిపల్లి, తుమిసి, ఏడోమైలు తదితర గ్రామాల వద్ద రోడ్డుకు ఇరువైపులా భవనాలను తొలగించనున్నారు. ఈ రోడ్డు ఫోర్‌లేన్‌గా మారితే ఏపీ నుంచి తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు రాకపోకలు జోరందుకోవడం ఖాయం.

కప్పాపేటలో కొలువుదీరిన పీర్లు


కప్పాపేటలో కొలువుదీరిన పీర్లు


పుంగనూరులో పీర్లకు ప్రత్యేక పూజలు చేస్తున్న ముస్లింలు


పుంగనూరులో అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

రొంపిచెర్ల: మండలంలోని జాండ్లవారిపల్లె పంచాయతీ కప్పాపేటలో పీర్లను కొలువుదీర్చారు. మొహర్రం పండుగ సందర్భంగా గురువారం జెండామాను వద్ద పీర్లను నిలిపి గంధం పూజలు చేశారు. ఈ పీర్ల పండుగ మూడు రోజులు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ముందుగా గ్రామం నడిబొడ్డున వున్న శాశ్వత స్థానంలో గున్నం తవ్వుతారు. తర్వాత గ్రామం చుట్టూ ఉన్న చెట్లను నరికి దేవునికి బలిగా గుండంలో వేసి నిప్పు పెడతారు. అగ్నిగుండం తొక్కడం, పీర్ల ఊరేగింపు, కోర్కెలు తీర్చుకునేందుకు అగ్నిగుండంలో నడుస్తారు. తదుపరి పీర్లను మంచి నీళ్ల బావిలో జల్దికి తీసుకెళతామని ముస్లిం మత పెద్దలు తెలిపారు. ప్రతి ఏటా గ్రామంలో జరిగే మొహర్రం పండుగకు ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున హాజరవుతారని గ్రామస్తులు తెలిపారు.

పీర్లకు ప్రత్యేక పూజలు

పుంగనూరు(చౌడేపల్లె): పుంగనూరు పట్టణం కుమ్మరవీధిలో గల మఖాన్‌పీర్ల చావిడిలో గురువారం పీర్లకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక ప్రార్థనలు, దువా చేశారు. రాత్రి అగ్నిగుండం ఏర్పాటు చేసి, పీర్ల ఊరేగింపు నిర్వహించారు. అలాగే మండలంలోని కుమ్మరగుంట, మేలుందొడ్డి గ్రామాల్లో పీర్లకు ప్రత్యేక పూజలు చేశారు. ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేశారు. కమిటీ నిర్వాహకులు అన్నదానం చేశారు.

కీలకంగా వైఎస్సార్ సీపీ యువజన విభాగం

- 2 వేల మందితో యువ సైన్యం ఏర్పాటు
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్ ఈసీ రెడ్డి


ఈ చంద్రశేఖర్‌రెడ్డి

పలమనేరు: కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించడంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం కీలకంగా పనిచేస్తుందని ఆ విభాగం పలమనేరు నియోజకవర్గ అధ్యక్షుడు ఈ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జగనన్న నిర్వహించిన సమావేశంలో తమకు పలు విషయాలను వివరించారని తెలిపారు. వాటిని పటిష్టంగా అమలు చేస్తామన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని యూత్ కమిటీలను బలోపేతం చేస్తామన్నారు. 90 పంచాయతీల్లో కీలకమైన యువతను ఎంపిక చేస్తామన్నారు. దీనిపై త్వరలో మండల స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి ఆపై నియోజకవర్గంలో రెండు వేల మందితో యువ సైన్యాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. తద్వారా ప్రజల్లో విస్తృతంగా తిరుగుతూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఎండగట్టి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించేలా కృషి చేస్తామన్నారు.

టిడ్కో గృహ సముదాయంలో నీటి సమస్య


కమిషనర్ మధుసూదన్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న మహిళలు

పుంగనూరు(చౌడేపల్లె): పుంగనూరు పట్టణంలోని గూడూరుపల్లి వద్ద ఉన్న టిడ్కో గృహ సముదాయంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు వాపోయారు. వారు గురువారం మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ టిడ్కో గృహ సముదాయంలోని ఎ-7 అపార్ట్‌మెంట్‌లో 20 రోజులుగా మంచినీరు రావడం లేదన్నారు. దీంతో బిందె నీరు రూ.20లు పెట్టి కొనుగోలు చేసుకుంటున్నామని వాపోయారు. తమకు తాగునీటిని సరఫరా చేసి ఆదుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ తక్షణం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండండి


జొన్నగురకలలో వృద్ధులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు


నలిశెట్టిపల్లెలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ కేశవనారాయణ

తవణంపల్లె: గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. గురువారం మండలంలోని జొన్నగురకలలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 48 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పరిస్తే వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

నలిశెట్టిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

మండలంలోని నలిశెట్టిపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. గర్భిణులు, చిన్నారులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించారు. ప్రజలు ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. గర్భిణులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం తల్లీబిడ్డకు క్షేమమని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు, రోగులు పాల్గొన్నారు.

కొంగాటంలో ఆస్పత్రి ఏర్పాటుకు కృషి


మండలంకు విచ్చేసిన మంత్రి సత్యకుమార్

వి.కోట: మండలంలోని కొంగాటం పంచాయతీలో ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటుకు కృషి చేస్తానని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆయన గురువారం కుప్పం పర్యటనకు వచ్చారు. అనంతరం కొంగాటంలోని బీజేపీ పలమనేరు అసెంబ్లీ కన్వీనర్ విజయ్ కుమార్ స్వగృహానికి వచ్చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మంత్రిని కలిసి సమస్యలను విన్నవించారు. పంచాయతీలో ప్రభుత్వ వైద్యశాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఆయన ప్రభుత్వంతో మాట్లాడి ఆస్పత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

క్రిస్టియన్ల అభివృద్ధికి చర్యలు చేపట్టండి

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో క్రిస్టియన్ల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షులు రమేష్ కోరారు. ఆయన గురువారం చిత్తూరు జిల్లా పర్యటనకు విచ్చేసిన కేంద్ర మంత్రి రాందాస్ అథవాలేను కలిశారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో క్రిస్టియన్ల అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలన్నారు. క్రిస్టియన్లు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని విన్నవించారు.

బాలికల రక్షణపై ప్రత్యేక దృష్టి


గుడిపాల: బాలికల హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ సంధ్య

గుడిపాల: బాలికలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సంధ్య తెలిపారు. ఆమె గురువారం గుడిపాలలో ఉన్న బాలికల వసతి గృహంలో పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలకు పర్సనల్ ఐజెన్ గురించి తెలియజేశారు. తీవ్రమైన ఎండలో వడదెబ్బ తగలకుండా నీరు ఎక్కువగా తాగాలన్నారు. అన్నిరోగాలకు నీరే ఔషధమన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం హాస్టల్‌లో వంటగది, పిల్లలు నిద్రించే గది, బాత్రూంలను పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి వివరించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బాల సూర్యనారాయణ, ఏఎన్‌ఎం జబసెల్వి, విజయ, ఎంఎల్‌హెచ్‌పీ ఉమామహేశ్వరి, చంద్రశేఖర్, ఆశావర్కర్లు సుజిమ, స్వప్న పాల్గొన్నారు.

యు-విన్ యాప్‌పై వైద్య సిబ్బందికి శిక్షణ

యాదమరి: స్థానిక వైద్యసిబ్బందికి జిల్లా కోఆర్డినేటర్ శివరామ కృష్ణ యు–విన్ యాప్‌పై శిక్షణ కల్పించారు. గురవారం ఆయన మండల పరిధిలోని జోడిచింతల శుచి కార్యాలయంలో శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల వైద్యాధికారి డా.అనిల్ కుమార్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, పిల్లల టీకాల పంపిణీ వివరాలను విధిగా యు–విన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. తద్వారా ప్రతి టీకా డిజిటల్‌గా నమోదు చేయడం వల్ల టీకా మోతాదును సకాలంలో అందించవచ్చన్నారు. డిఫ్తీరియా, మీజిల్స్, రూబెల్లా వంటి అనేక రకాల వ్యాధులను ఎదుర్కొనేందుకు గర్భిణులు, చిన్నారులకు టీకాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు తిరుచ్చిపై సూర్య నారాయణుడు

చంద్రగిరి: పద్మావతి అమ్మవారి ఆలయ అనుబంధ శ్రీసూర్యనారాయణ స్వామి గురువారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. తొలుత వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు, స్వామివారి జన్మనక్షత్రమైన హస్త సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని వజ్ర వైఢూర్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

యథేచ్ఛగా ప్రభుత్వ స్థలం కబ్జా


పెంగరగుంట పంచాయతీ చిన్నకుంట వద్ద ఆక్రమణకు గురైన ఆర్‌అండ్‌బీ స్థలం

పలమనేరు: అధికారం అండతో కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు. చెరువులు, వాగులు, వంకల నుంచి ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా వారి కన్ను ప్రభుత్వ స్థలాలపై పడింది. మండలంలోని పలమనేరు- గుడియాత్తం రోడ్డులోని ఆర్‌అండ్‌బీ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టారు. కొల్లబాబు, నరసింహులు అనేవారు పెంగరగుంట పంచాయతీ చిన్నకుంట వద్ద ఆర్‌అండ్‌బీ స్థలంలో ఐదుసెంట్ల స్థలాన్ని కబ్జాచేసి పక్కనే ఉన్న పుల్లల చెరువులోంచి జేసీబీలతో మట్టి తోలి లెవలింగ్ చేశారు. ఈ మార్గంలో ముసలిమొడుగు వద్ద కుంకీ ఎలిఫెంట్ ప్రాజెక్టు ఏర్పాటైంది. దీంతో ఏనుగులను చూసేందుకు పట్టణం నుంచి నిత్యం సందర్శకులు ఎక్కువ మంది వస్తుంటారు. ఈ క్రమంలో రోడ్డు పక్కన స్థలాలు ఆక్రమించుకుని షాపులు పెట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు మండలానికి చెందిన ఒక కీలక పచ్చనేత వారికి అండగా వున్నట్టు సమాచారం. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. జిల్లా అధికారులైనా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మాజీ సీఎంను కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు


మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన యువజన విభాగం జాయింట్ సెక్రటరీ భాగ్యరాజ్

కుప్పం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీ భాగ్యరాజ్ ప్రభంజన కలిశారు. తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన యువజన విభాగం సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కుప్పంలో పార్టీ స్థితిగతులపై వివరించారు.

ఉపాధ్యాయులకు సన్మానం


సన్మానం అందుకుంటున్న ఉపాధ్యాయులు

పెద్దపంజాణి: మండలంలోని అప్పినపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీ అయిన హెచ్ఎం నందకుమార్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్‌రెడ్డి, గోపి, ఉదయ్‌కుమార్, శ్రీదేవి తదితరులను గురువారం ప్రస్తుత హెచ్‌ఎం సుభాషిని, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్, ప్రసన్న, ప్రసాద్, హరికృష్ణ, సోమశేఖర్, భారతి పాల్గొన్నారు.

బుద్ధుడి విగ్రహం ధ్వంసం దారుణం


నిరసన తెలుపుతున్న బాస్ నాయకులు

వి.కోట : మదనపల్లి సమీపంలో బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భారతీయ అంబేడ్కర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు గణపతి డిమాండ్ చేశారు. ఆయన గురువారం ఆ సంఘం సభ్యులతో కలిసి స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ మదనపల్లి సమీపంలోని అంకిశెట్టిపల్లి వద్ద ఏర్పాటు చేసిన బుద్ధుడి విగ్రహం తలను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం ధ్వంసం చేశారని పేర్కొన్నారు. అక్కడున్న సీసీ కెమెరాలను సైతం పగులగొట్టారని తెలిపారు. దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బాస్ నాయకులు వినోద్, నాగరాజు, అశ్వత్, రాజగోపాల్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కిరాత వైష్ణవీ మాతగా అమ్మవారు


ప్రత్యేక అలంకరణలో వైష్ణవీ మాత

చౌడేపల్లె: మండలంలోని పుదిపట్ల సమీపంలో వెలసిన వైష్ణవీ దేవి ఆలయంలో వారాహి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం అమ్మవారు కిరాత వైష్ణవీ మాత అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా బిల్లేరుకు చెందిన భార్గవి కుటుంబ సభ్యులు వ్యవహరించినట్లు అర్చకురాలు శ్రావణి తెలిపారు. ప్రత్యేక పూజల అనంతరం వారాహి సౌందర్యలహరి పారాయణం చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.

5 నుంచి సీపీఐ నిరసనలు

పలమనేరు: విద్యుత్ చార్జీలను పెంచబోమని కూటమి పెద్దలు ఎన్నికల్లో హామీ ఇచ్చారని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు గుర్తు చేశారు. ఇప్పుడు భారీగా పెంచి ప్రజల నడ్డి విరిచారని పేర్కొన్నారు. ఈ క్రమంలో చార్జీల పెంపును నిరసిస్తూ ఈ నెల 5 నుంచి జిల్లాలోని అన్ని నియోజకర్గాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే పాత చార్జీల సర్దుబాట్ల పేరిట వాడిన కరెంట్ చార్జీల కంటే ఎక్కువగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలకు నష్టం తప్పదన్న చంద్రబాబు ఇప్పుడు వాటినే ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ క్రమంలో ప్రభుత్వం దిగివచ్చి విద్యుత్ చార్జీలు తగ్గించే వరకు నిరసనలు చేపడతామని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.